క్లుప్తంగా

శ్రీశైలభ్రామరీకి లక్షకుంకుమార్చన

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల శ్రీభ్రమరాంబాదేవికి శ్రావణ పౌర్ణమి సందర్భంగా బుధవారం లక్షకుంకుమార్చన పూజలను నిర్వహించారు. ఈ పూజలో భక్తుల పరోక్ష సేవగా పాల్గొనేందుకు దేవస్థానం అవకాశం కలిపించింది. అర్చకులు,వేదపండితులు ముందుగా పూజా సంకల్పాన్నిపఠించి, కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి పూజను నిర్వహించారు. అనంతరం లక్షకుంకుమార్చనను జరిపించారు.

శ్రీశైలంలో వరుణజపాలు
రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు తొలగి, సకాలంలో తగినంత వర్షాలు కురిసి రాష్ట్రంతో పాటు, దేశం సుభిక్షంగా ఉండాలనే సంకల్పంతో దేవస్థానం వరుణ జపాలను చేయిస్తుంది. ఈ నెల 28న ప్రారంభమైన జపాలు సెప్టెంబర్ 2 వ తేది వరకు కొనసాగనున్నాయి. కాగా శ్రీశైలంలో ఉదయం నుంచి ఎండవేడిమి ఉన్నప్పటికి మధ్యాహ్నం హఠాత్తుగా భారీగా కురిసింది.

అమ్మవారికి పల్లకీ సేవ
శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవ మూర్తులకు బుధవారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా పల్లకీ సేవ నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులు ఆశీనులుగావించి ప్రత్యేక పూజలు చేశారు.

తిమ్మాపురంలో ఘర్షణ
మహానంది: మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురం గ్రామంలో బుధవారం రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఇరువర్గాలకు చెందిన కొందరు యువకులు ఓ కేసు విషయంలో గొడవ పడ్డారు. బాధిత యువకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు మహాలక్ష్మియాగం
మహానంది: గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామంలో కొలువైన శ్రీ గంగా, గౌరీ సమేత మరకతలింగేశ్వర, నవగ్రహాల ఆలయాల్లో గురువారం మహాలక్ష్మియాగం నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు కనమర్లపూడి మస్తాన్‌రావు తెలిపారు. ఉదయం 8.30 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు.

మరెన్నో పదవులు అలంకరించాలి
ఆత్మకూరు: నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి తిమోతి మరెన్నో పదవులు అలంకరించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ దరగయ్య, మండల ఇన్‌చార్జ్ బుజ్జి మాదిగ ఆకాంక్షించారు. పట్టణంలోని అంబేద్కర్ స్ఫూర్తి కేంద్రంలో బుధవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి తిమోతిని ఘనంగా సన్మానించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పుల్లయ్య, నాగయ్య, దేవసహాయం, వరదరాజు, వెంకటరమణ పాల్గొన్నారు.

భక్తుల సౌకర్యాలకు పెద్దపీట

- శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- రాబోయే 25సంవత్సరాలను దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు


ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి విచ్చేసే భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనే తమ ధ్యేయమని, భక్తుల సౌకర్యాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. బుధవారం శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల మండలి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ధర్మకర్తల మండలి సమావేశంలో చాలా విషయాలపై సుదీర్ఘంగా చర్చించామని, దేవస్థానానికి, భక్తులకు మేలు కలిగే విధంగా సమావేశం జరిగిందన్నారు. రోజు రోజుకు క్షేత్రానికి భక్తుల రద్దీ పెరుగుతున్న నేపధ్యంలో రాబోయే 25సంవత్సరాలను దృష్టిలో ఉంచుకుని పలు నిర్ణయాలు, శాశ్వత నిర్మాణాలను చేపట్టాలని నిర్ణయించామని తెలిపారు. కైలాసద్వారం వద్ద 5లక్షల లీటర్ల సామర్థంతో ఓవర్ హెడ్ ట్యాంక్, రూ.40లక్షలతో పాతాళగంగ వద్ద పిండ ప్రధానానికి షెడ్డు ఏర్పాటు చేయాలని నిర్ణయించామని తెలిపారు. ఆలయంలో ప్రస్తుతం ఉన్న రూ.లక్షతో ఉన్న ఉదయాస్తమాన సేవను భక్తులకు మరింత సరళతరం చేయాలనే ఉద్దేశంతో రూ.25వేలతో ప్రాతఃకాల పూజ సేవను ప్రవేశ పెడుతున్నామని చెప్పారు. వన్యప్రాణులు క్షేత్ర పరిధిలోకి రాకుండా ఫెన్సింగ్ ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు.

ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం
శ్రీశైలదేవస్థానం పరిధిలో పలు ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన ఉచిత మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి బుధవారం ప్రారంభించారు. డీవీస్ లేబొరేటరీ సంస్థ సహకారంతో క్షేత్ర పరిధిలోని అన్నదాన భవన సముదాయం వద్ద, ఆర్టీసీ బస్టాండ్ సముదాయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉచిత మినరల్ వాటర్‌ప్లాంట్‌ను దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్‌రెడ్డివారి చక్రపాణిరెడ్డి, దేవస్థానం ఈఓ ఎస్ లవన్నతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు మఠం విరూపాక్షయ్యస్వామి, ఎమ్ నరసింహారెడ్డి, మేరాజోత్ హనుమంత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

షాదీఖానా నిర్మాణ పనుల పరిశీలన
వెలుగోడు: పట్టణంలో నిర్మాణంలో ఉన్న షాదీఖానా పనులను శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పరిశీలించారు. బుధవారం షాదీఖానాను సందర్శించిన ఆయన నిర్మాణ పనుల పురోగతిపై అధికారులను, కాంట్రాక్టర్లను ఆరా తీశారు. పనులన్నింటినీ సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి ముస్లిం మైనారిటీలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట షాదీఖానా ప్రెసిడెంట్ మొహమ్మద్ ఖాన్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎం ఇలియాస్ ఖాన్, ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ వేల్పుల జయపాల్, నాయకులు ఉన్నారు. అనంతరం పట్టణానికి చెందిన నాగేశ్వరరావు కుమారుడి వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

వానలోనూ గడప గడప కార్యక్రమం

- పగిడ్యాలలో పర్యటించిన ఎమ్మెల్యే ఆర్థర్


లబ్ధిదారులకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే ఆర్థర్

పగిడ్యాల: స్థానిక సచివాలయం -2 పరిధిలో బుధవారం నిర్వహించిన గడప గడప కార్యక్రమానికి వరుణ దేవుడు స్వాగతం పలికాడు. సీఎస్ఐ చర్చి నుంచి ప్రారంభమైన గడప గడప కార్యక్రమం పాలమర్రి స్టేజ్ వద్ద డ్రైవర్ సలాం ఇంటి వద్ద ముగిసింది. సచివాలయం -2 పరిధిలో ఇంటింటికీ తిరిగి సంక్షేమ బావుటా పుస్తకాలను అందజేసి పథకాల నుంచి పొందిన లబ్ధిని వివరించారు. వర్షం కురుస్తున్నప్పటికీ ఎమ్మెల్యే అలుపెరుగకుండా ముందుకు సాగారు. పగడం పక్కిరయ్య ఇంటి వద్దకు చేరి ఈ నాలుగేళ్ల కాలంలో అతను ప్రభుత్వం నుంచి రూ. 7,76,856లు లబ్ధిపొందినట్లు వివరించారు. గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ సూర్యప్రకాష్, ఎంఈఓ సుభాన్, వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు సగినేల రమణ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రమాదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు జయరామిరెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం
వెలుగోడు: పాఠశాల నుంచే పర్యావరణ పరిరక్షణ ప్రస్థానం జరగాలని, చిన్నారులు భావి ప్రపంచానికి మార్గదర్శకులుగా నిలవాలని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ అబ్దుల్ కరీం పిలుపునిచ్చారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా బుధవారం స్థానిక మోడల్ స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నళిని, వైస్ ప్రిన్సిపాల్ పుల్లయ్య, సిబ్బంది రమేష్, రవి, చాంద్‌బాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

పోతిరెడ్డిపాడు నుంచి తగ్గిన నీటిసరఫరా
జూపాడుబంగ్లా: శ్రీశైలం డ్యాంలో నీటిమట్టం 853.40అడుగులకు చేరటంతో పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ఐదుగేట్ల ద్వారా కేవలం 3వేల క్యూసెక్కుల నీరు మాత్రమే ఎస్సార్ఎమ్సీ కాల్వలోకి వెళ్తున్నట్లు ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి బుధవారం తెలిపారు. సాయంత్రం పోతిరెడ్డిపాడు వద్ద 852.40 అడుగుల నీటిమట్టం నమోదైందన్నారు. ప్రస్తుతం విడుదలవుతున్న నీటిని బానకచర్ల నీటినియంత్రణ వ్యవస్థ నుంచి ఎస్సార్బీసీ కాల్వకు 2,500 క్యూసెక్కులు, కేసీ ఎస్కేప్ కాల్వకు 500 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు.

ఆస్తి హక్కు పత్రాలు ఇవ్వడానికే సర్వే
పాములపాడు: గ్రామాల్లో నివసించే ప్రతి ఒక్కరికి వారి ఆస్తి హక్కు పత్రాలు ఇవ్వడానికే సర్వే నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గోపీకృష్ణ తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని బానుముక్కల, బానకచెర్ల, గుండాలనట్టు, వానాల గ్రామాల్లో వైఎస్ఆర్ జగనన్న శాశ్విత భూహక్కు పథకంలో భాగంగా గ్రామ కంఠంలో ప్రతి ఆస్తి వివరాలు సర్వే చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఈఓపీఆర్డీ శ్రీనివాసులు నాయుడు ఉన్నారు.

మిడుతూరు ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి
నందికొట్కూరు: అన్యాయంగా, అక్రమంగా రౌడీ షీట్ నమోదు చేసిన మారుతీశంకర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ప్రేమ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని పోలీసు స్టేషన్ ఎదుట మిడుతూరు ఎస్ఐని వెంటనే సస్పెండ్ చేయాలంటూ ఎమ్మార్పీఎస్ నాయకులు ధర్నా కార్యక్రమం చేపట్టారు. అనంతరం రూరల్ సీఐ విజయభాస్కర్‌కు వినతి పత్రం అందజేశారు.

కొనసాగుతున్న ఏసీబీ అధికారుల పరిశీలన
శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానంలో గతంలో జరిగిన అభివృద్ధి పనుల్లో భాగంగా చేపట్టిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వాటర్‌సిస్టమ్‌ను ఏసీబీ అధికారులు పరిశీలించారు. ఈ పరిశీలన గత రెండు రోజులుగా సాగుతోంది. బుధవారం ఏసీబీ సీఐ వంశీనాథ్ నేతృత్వంలో ఆ శాఖ ఇంజనీరింగ్ అధికారులు డీఈ రామకృష్ణ, ఏఈ శ్రీనివాసులు క్షేత్రపరిధిలోని పలు చోట్ల తనిఖీలు చేపట్టారు. పాతాళగంగ నుంచి క్షేత్రానికి సరఫరా అయ్యే వాటర్‌పంపింగ్ సిస్టమ్‌ను పరిశీలించారు.

సంక్షిప్తం

అర్హులైనవారికి ఇళ్ల పట్టాలు ఇస్తాం
కొత్తపల్లి: అర్హులైనవారికి ఇంటి పట్టాలు మంజూరు చేస్తామని తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ అన్నారు. బుధవారం కపిలేశ్వరం సమీపంలోని ఇంటి స్థలాలు, సిద్ధేశ్వరం గ్రామ పరిసర ప్రాంతంలో శ్రీశైలం ప్రాజెక్ట్ నీటిముంపు భూములు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జెడ్పీటీసీ సోముల సుధాకర్ రెడ్డి, నందికొట్కూరు మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ రమేష్ నాయుడు పలుమార్లు నీటి ముంపు భూములపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారన్నారు. వారి ఆదేశాల మేరకు ముంపు భూములను పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, వీఆర్వో మౌలాలి, వైఎస్సార్‌సీపీ నాయకుడు నారాయణరెడ్డి ఉన్నారు.

భూములు కోల్పోయిన రైతులు అర్జీలు ఇవ్వాలి
పాములపాడు: జాతీయ రహదారి 340సీలో భూములు కోల్పోయిన రైతులు అర్జీలు ఇవ్వాలని తహసీల్దార్ రత్నరాధిక కోరారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇప్పటికే మండలంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, అర్జీలు ఇచ్చిన వారికి పరిహారం జమ చేశామన్నారు. కాగా ఇంకా కొందరు గ్రామాల వారీగా జూటూరు 40, రుద్రవరం 39, బానుముక్కల 3, కంబాలపల్లి 3, పాములపాడు 22, యర్రగూడూరు 64 మంది చొప్పున అర్జీలు ఇవ్వలేదని చెప్పారు. వీరందరూ ఆయా గ్రామాల్లోని వీఆర్ఓలకు లేదా తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించి అర్జీలు ఇవ్వాలన్నారు.

ఇద్దరికి ఎంపీడీఓలుగా పదోన్నతి
జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న జ్యోతి, ఈఓపీఆర్డీగా పని చేస్తున్న సుబ్రమణ్యశర్మలకు ప్రభుత్వం ఎంపీడీఓలు గా పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. జ్యోతిని వైఎస్సార్ జిల్లాకు, సుబ్రమణ్యశర్మను తిరుపతి జిల్లాకు బదిలీచేశారు. వీరు రెండు రోజుల్లో వారి విధుల్లోంచి వారికి కేటాయించిన జిల్లాల్లో బాధ్యతలు చేపట్టనున్నారు.

వైఎస్సార్ బీమా పరిహారం అందజేత
మిడుతూరు: మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన బొంతల మాలిక్ బాషా గతేడాది నవంబర్‌లో మరణించాడు. ఆయన భార్య దౌలత్‌బీకి వైఎస్సార్ బీమా కింద మంజూరైన రూ.లక్షను బుధవారం గ్రామ ఉప సర్పంచ్ సుబ్బారెడ్డి అందించారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన
నందికొట్కూరు: వ్యక్తిత్వ వికాసంపై అవగాహన ఎంతో అవసరమని మహారాష్ట్ర ప్రముఖ ప్రొఫెసర్, సైంటిస్ట్ డాక్టర్ విశాల అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వ్యక్తిత్వ వికాసం, అభివృద్ధి నైపుణ్యాలు అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆమె పాల్గొన్నారు. మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకుంటే భవిష్యత్తులో రాణిస్తారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. సునీత, అధ్యాపకులు తాజుద్దీన్, రఘుపతిరెడ్డి పాల్గొన్నారు.

దస్తావేజు లేఖరుల పెన్‌డౌన్
నందికొట్కూరు/ఆత్మకూరు: రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా ప్రవేశపెట్టబోతున్న కార్డు ప్రైమ్ 2.0 వలన దస్తావేజు లేఖరులు, స్టాంప్ వెండర్లకు మనుగడ ఉండదని దస్తావేజుల సంఘం నందికొట్కూరు అధ్యక్షుడు భీమారావు, ఆత్మకూరు స్టాంప్ రైటర్ల నాయకులు కిరణ్‌కుమార్, నాగేంద్ర అన్నారు. బుధవారం ఆయా రిజిస్ట్రేషన్ కార్యాలయాల ఎదుట పెన్‌డౌన్ నిర్వహించారు. నందికొట్కూరులో రిజిస్ట్రార్ అధికారి చంద్రమౌళికి వినతి పత్రం అందజేశారు. దస్తావేజు లేఖరులు మున్వార్, మహమ్మద్‌రఫీ, యుగంధర్, శేఖర్, బాష, ఓబులేసు పాల్గొన్నారు.

వర్షం కోసం ప్రార్థనలు, పూజలు
పాములపాడు: వర్షం కోసం 3 రోజులుగా మండలంలోని జూటూరు గ్రామంలో ముస్లింలు ఈద్గా వద్ద ప్రార్థనలు, లింగాల గ్రామంలో రైతులు పూజలు నిర్వహిస్తున్నారు. వరుణుడు కరుణించాలని సమృద్ధిగా వర్షాలు కురవాలని కోరుకున్నారు. లింగాల గ్రామంలో రైతులు ప్రత్యేక పూజల అనంతరం నాభిశిల వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి
ఆత్మకూరు: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని ఆత్మకూరు వైద్యాధికారి డాక్టర్ నాగన్న సూచించారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో క్రీడాదినోత్సవం సందర్భంగా హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రభుత్వ గుండె వైద్య నిపుణులు క్రాంతి చైతన్య, జహంగీర్‌బాషా, రఫిక్, నాగన్న పాల్గొన్నారు.

మంచి మార్గాన్ని ఎంచుకోవాలి
పాములపాడు: ప్రతి ఒక్కరూ మంచి మార్గమును ఎంచుకోవాలని ఎస్ఐ అశోక్ సూచించారు. బుధవారం మండలంలోని బానుముక్కల గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ అల్లర్లు, గొడవలకు దూరంగా ఉండి ప్రశాంత జీవనాన్ని సాగించాలన్నారు. గ్రామంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తెలిస్తే వెంటనే సమాచారం అందించాలని కోరారు.

నేడు మార్కెట్ యార్డు కమిటీ ప్రమాణస్వీకారం
నందికొట్కూరు: మార్కెట్ యార్డు నూతన కమిటీ ప్రమాణస్వీకారం గురువారం నిర్వహిస్తున్నట్లు మార్కెట్ యార్డు సెక్రటరీ కృష్ణానాయక్ తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 11 గంటలకు ప్రమాణస్వీకారోత్సవం ఉంటుందన్నారు.

స్పందన అర్జీలను పరిష్కరించండి
కొత్తపల్లి: మండలంలోని గ్రామాల నుంచి స్పందన కార్యక్రమానికి వస్తున్న అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఆత్మకూరు ఆర్డీఓ దాసు ఆదేశించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ అధ్వర్యంలో రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్పందన అర్జీల పట్ల ఏ అధికారికూడా నిర్లక్ష్యం చేయకూడదన్నారు. డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, వీఆర్వోలు ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై 'సమరభేరి'
వెలుగోడు: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సమరభేరికి సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వి.యేసురత్నం పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో సీపీఎం సమరభేరి పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు యాదాటి నాగేంద్రుడు, వి నాగమోహన్, వెంకటయ్య, ఎర్ర బాషా, రామకృష్ణ, ఖాదర్ బాషా, నూరుల్లా పాల్గొన్నారు.